నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం

27 నవంబర్ 2025 పేజీలు : 08



## వారి మనస్సాక్షికే తెలుసు..

# నేనంటే ఏమిటో !

### మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నా మీద అవిశ్వాసం కోరుతూ.. సంతకాలు పెట్టిన కార్పొరేటర్ల మనస్సాక్షికే తెలుసు తనంటే ఏమిటో.. అని నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. బుధవారం మేయర్ స్రవంతి తన చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు మద్దతు తెలిపిన గిరిజన సంఘ నాయకులకు, ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్.. తాను అభివృద్ధికి అడ్డుగా ఉన్నానని, అవినీతి చేశానని చెప్పడం సరికాదన్నారు. తాను అభివృద్ధికి అడ్డంగా ఉంటే, పొదలకూరు రోడ్డు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు పచ్చదనం జరిగేవా అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వీఆర్ మున్సిపల్ హైస్కూల్ అభివృద్ధి, స్కూలుకు పది బస్సులు అనుమతులు నా ప్రమేయం లేకుండా జరిగిందా.. అన్నారు. నగరంలో 200 కుటుంబాలకు లబ్ధి చేకూరే స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను ప్రారంభించారన్నారు. పార్కులు, రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. తన దగ్గరకు వచ్చిన ఫైల్స్ తిప్పు తున్నానని రూప్ కుమార్ చెప్పడం సరికాదన్నారు. ఎప్పుడు కూడా పెండింగ్లో లేవని, ఎప్పటికప్పుడు వాటిని క్లియర్ చేయడం జరిగిందన్నారు. నేను అభివృద్ధికి ఆటంకమని

-మిగతా 2లో

- జిల్లాలో 1,95,866 మంది రైతులకు రూ.130.20 కోట్లు జమ
- ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో ఏడాదికి రూ.20వేలు
- రెండు విడతల్లో రూ.14 వేలు జమ చేసిన ప్రభుత్వం
- నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



## అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ నిధులు

# రైతుల ముఖాల్లో చిరునవ్వులు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

జిల్లాలో రబీ సీజన్ పనులు మొదలైన సమయంలో ప్రభుత్వం జమ చేసిన పెట్టుబడి సాయం రైతులకు పెద్ద ఊరటనిచ్చింది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు చేయూత అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకం రైతులకు వరంగా నిలిచింది. ఏడాదికి 3 విడతల్లో మొత్తం రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే ఇప్పటికే రెండో విడతతో కలిపి రైతుల ఖాతాల్లో రూ.14 వేలు జమ కావడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడం వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

### జిల్లాలో 1,95,866 మంది రైతులకు రూ.130.20 కోట్లు జమ

జిల్లావ్యాప్తంగా 1,95,866 మంది రైతులకు రూ.130.20 కోట్లు నగదును అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ రెండో విడత చెల్లింపులను రైతుల ఖాతాలకు నేరుగా ప్రభుత్వం జమ చేసింది. ఉదయగిరి నియోజకవర్గంలో 45275 మంది

-మిగతా 2లో



# సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం

- గతంలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేస్తున్నాం
- గ్రామీణ అభివృద్ధికి ఉద్దేశించిన 15 ఆర్థిక సంఘ నిధులు గత ప్రభుత్వం దుర్వినియోగం చేసింది
- సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన కొనసాగుతుంది
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం నా ఇంటి తలుపు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను
- ప్రజాదర్బార్ కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు నిరంతర ప్రక్రియ

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

కోవూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్య సాధనలో కేవలం అధికారులే కాదు.. స్థానిక నాయకుల కూడా చొరవ చూపాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు

>> 2లో..

## పట్టపగలే టీడీపీ నేత

# దారుణ హత్య

వివరాలు 8లో





మండలంలోని గట్టుపల్లి చింతలపాలెం గ్రామం టీడీపీ నాయకు లు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు బుధవా రం పట్టపగలే హత్యకు గురయ్యాడు. 5 కేజీలు కోళ్లు కావాలంటూ ప్రసాద్‌కు చెందిన కోళ్ల ఫారంకు వచ్చిన వ్యక్తులు ఈ హత్యకు ఒడిగట్టి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# డిమాండ్ ఉన్న పంటలను పండించండి

- ఇప్పటికే రెండు విడతలు యూరియా పంపిణి చేశాం.. త్వరలో మూడో విడత పంపిణీ చేస్తాం
- చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టాం
- ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించండి
- సాగునీటి కాలువలలో పూడిక సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి, సత్వరమే పరిష్కరిస్తా..
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన పట్ల ఆసక్తి ఉన్న రైతులకు ఎంఎస్ఎంఈ ద్వారా ఆర్థిక సహాయం చేస్తాను
- రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గంలో 20 ఏళ్లుగా అపరిష్కృతంగా వున్న సాగునీటి కాలవల్లో సిల్ట్ క్లియరెన్స్ సమస్యను పరిష్కారం పట్ల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో పొలంగట్లపై నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కూటమి ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ విధానాలను రైతులకు వివరించారు. పార్లపల్లిలో టిడిపి నాయకులు, రైతులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. విమర్శలు చేయడం తప్ప ప్రతి పక్షాల వల్ల వరిగేదేమి లేదనన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆమె రైతులకు సూచించారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఆధునికి యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని వ్యవసాయ శాఖ అధిరులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకొని రైతులు లబ్ది పొందాలని కోరారు. డిమాండ్ ఉన్న పంటలను పండించాలని ఆమె రైతులను కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి సుపారిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆమె కోవూరు నియోజకవర్గ రైతాంగం తరుపున ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. యూరియా కొరతపై ప్రతి పక్షాలు అనవసర అసత్య ప్రచారం చేస్తున్నాయని, రైతులకు ఇప్పటికే రెండు విడతలు యూరియా పంపిణి చేశామని త్వరలో మరో విడత పంపిణీ చేస్తామన్నారు. రైతుల సాధక బాధలు ప్రత్యక్షంగా తెలుసుకోవడమే రైతన్నా.. మీకోసం కార్యక్రమ లక్ష్యమన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిన విషయాన్ని ఉటంకిస్తూ సాంకేతిక కారణాలతో ఎవరికైన అన్నదాత సుఖీభవ అందకుంటే సచివాలయంలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. భగవంతుడి దయవల్ల కోవూరు నియోజకవర్గంలో ఎటువంటి సాగునీటి సమస్యలు లేవని ఆయకట్టు చివరి ఎకరాకు సైతం సాగునీరందించేందుకు కాలువలలో పూడిక తీసిన విషయాన్ని ఆమె రైతులకు గుర్తు చేస్తూ ఎక్కడైనా సిల్ట్ క్లియరెన్స్ సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ అనిత, టిడిపి అధ్యక్షులు ఏటూరి శ్రీహరిరెడ్డి, నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, ఆడపాల జనార్ధన్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, సత్యంరెడ్డి, రామిశెట్టి వెంకటరర్లు, ఏసోబు, వెంకటరమణయ్య, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ నిధులు.. రైతుల ముఖాల్లో చిరునవ్వులు

*(మొదటి పేజీ తరువాయి)*

లబ్దిదారులకు రూ.30.18 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో 34223 మందికి రూ.22.95 కోట్లు, కావలి నియోజకవర్గంలో 18305 మందికి రూ.11.93 కోట్లు, కోవూరు నియోజకవర్గంలో 16938 మందికి రూ.10.94 కోట్లు, సర్వేపల్లి నియోజకవర్గంలో 27958 మందికి రూ.18.59 కోట్లు, నెల్లూరు నియోజకవర్గంలో 5299 మందికి రూ.3.48 కోట్లు, వెంకటగిరి నియోజకవర్గంలో 16,015 మందికి రూ.10.64 కోట్లు, కందుకూరు నియోజకవర్గంలో 31,853 మందికి రూ.21.46 కోట్లు రైతుల మేర రైతులకు లబ్ధి చేకూరింది.

### అర్హులందరికి అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్

**- కలెక్టర్ హిమాన్షు శుక్ల**



జిల్లాలో అర్హులందరికీ పారదర్శకంగా అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ నిధులను జమ చేశాం. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అర్హుల వివరాలు సేకరించి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశాం. ఇంకా అర్హత కలిగి ఉండి ఎవరికైనా నగదు జమ కాకపోతే సమీపంలోని సచివాలయాలను, రైతుసేవా కేంద్రాలను తగిన ఆధారాలతో సంప్రదించాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు.

### వ్యవసాయ ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి

**-ఎస్‌కె జిలానీ బాషా, రైతు, కొడవలూరు**



ఈ ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయడం వల్ల మా వ్యవసాయఖర్చులకు ఎంతో ఉపయోగపడ్డాయి. గతంలో ప్రతిసారి పెట్టుబడి సాయం కోసం కొంత ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వం పూర్తి ఉచితంగా పెట్టుబడి సాయంగా డబ్బులు అందించడం చాలా ఆనందంగా ఉంది. అలాగే వర్షాలు పుష్కలంగా కురిసి సోమశిల, కండలేరు జలాశయాల నుంచి నీటిని విడుదల చేయడంతో సాగునీటి ఇబ్బందులు కూడా లేవు. అన్నదాతలందరి తరపున ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

### గతం కంటే అధికంగా డబ్బులు జమ చేయడం సంతోషంగా ఉంది

**-అంతటి పెంచల నారాయణ, మరుపూరు**



గతంలో ఏడాదికి కేవలం 13500 మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు రూ.20 వేలు ఇస్తామని చెప్పి, చెప్పిన మాట ప్రకారం రెండు విడతల్లో రూ.14 వేలు ప్రభుత్వం నా బ్యాంకు అకౌంట్‌లో జమ చేసింది. చాలా సంతోషంగా ఉంది. నాకు 2.25 సెంట్ల పొలంలో వరిసాగుకు వరినారుమళ్లు, ఎరువులు కొనుగోలు చేశాను. గత ఏడాది 7 వేలు, ఈసారి 7 వేలు జమ చేసిన రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు.

## వారి మనస్సాక్షికే తెలుసు..

# నేనంటే ఏమిటో !



*(మొదటి పేజీ తరువాయి)*

వారు నాపై అవిశ్వాసం పెట్టడం సరికాదన్నారు. తానేంటో ప్రజలకు తెలుసన్నారు. మా వెంట ఉన్న ఎస్‌కె. సిరాజ్ అనే యువకుడు ఇంటిపై దాడి చేయడం, రౌడీయిజం చేయడం సరికాదన్నారు. తమను రూరల్ ఎమ్మెల్యే పరోక్షంగా ఇబ్బంది పెడుతున్నారని ఆమె తెలిపారు. అనంతరం మేయర్ భర్త జయవర్ధన్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి 13 సంవత్సరాలు ఊడిగం చేశానన్నారు. మాకు మేయర్ పదవి కూడా ఇచ్చారన్నారు. ఆయన ఇప్పుడు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కోటంరెడ్డి సోదరులపై జయవర్ధన్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. మేయర్ పదవి కోసం డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ నాలుగేళ్ల నుంచి కుట్రలు చేస్తున్నారని జయవర్ధన్ ఆరోపించారు. ఇంత మంది అభిమానం సంపాదించుకున్న తాము గర్విస్తున్నామని జయవర్ధన్ ఈ సందర్భంగా తెలిపారు.

## సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం



*(మొదటి పేజీ తరువాయి)*

ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కారించడానికే ప్రజల మధ్యకు వచ్చానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఆమె హామీనిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. గ్రామీణ అభివృద్ధికి ఉద్దేశించిన 15 ఆర్థిక సంఘ నిధులు గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని, గతంలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉన్నా.. సాంకేతిక లోపాల కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే, అవన్నీ ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా హామీనిచ్చారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి వాగ్ధానాన్ని అమలు చేస్తామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల క్షేమం కోరే ప్రభుత్వమన్నారు. అస్తవ్యస్తమైన పాలనా వ్యవస్థను చక్కదిద్ది చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారని, 18 నెలల వ్యవధిలో కూటమి ప్రభుత్వ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని, భవిషత్తులోనూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏటూరి శ్రీహరి రెడ్డి, టిడిపి నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, ఆడపాల జనార్దన్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, సత్యం రెడ్డి, రామిశెట్టి వెంకటరర్లు, ఏసోబు, వెంకటరమణయ్య, టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికకోడ్‌లకు వ్యతిరేకంగా భీమా ఉద్యోగుల నిరసన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ఆత్మకూరులో ఎల్ఐసి కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. 29కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా నోటిఫికేషన్ చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఏకపక్ష అప్రజాస్వామిక లేబర్‌కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని, వెంటనే రద్దు చేయాలని ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పిక్స్‌డు ఎంప్లాయ్‌మెంట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పనిగంటల పెంపుదలను నిలిపివేయాలని, హైర్ అండ్ ఫైర్ పద్ధతిని రద్దుచేయాలని, పాతకార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, సామాజికభద్రతకు విఘాతం కల్గించే లేబర్‌కోడ్‌లను వెనక్కు తీసుకోవాలని, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, ఎల్ఐసిలో ఏఐఐఇఏకు గుర్తింపు ఇవ్వాలని, నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేయాలని, అందరికీ పాత పెన్షన్ విధానం అమలుచేయాలని, ఇండియన్‌లేబర్ కాన్ఫరెన్స్ వెంటనే



నిర్వహించాలని, కేంద్ర కార్మికసంఘాలతో వెంటనే చర్చలు జరపాలని, కార్మికుల ప్రయోజనాలను కాలరాసిన నోటిఫికేషన్‌ను రదుప్దేచేయాలని వారు డిమాండ్ చేస్తూ ఆమేరకు నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో భీమా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు టి.రమేష్, కార్యదర్శి ఎస్.శ్యామ్ ప్రభాకర్, ఎం.రమాదేవి, బ్రాంచ్ ఉద్యోగులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి : ఎం.మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26సందర్భంగా ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించినారని తెలిపినారు దీనిని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు కృషి చేసి రాసినారని పేర్కొన్నారు. 1950 జనవరి 26 రాజ్యాంగాన్ని ఆమోదిం చడం జరిగినది. ఎంతోమంది న్యాయ శాస్త్ర కోవిదులు స్వాతంత్ర సమరయోధులు భారత రాజ్యాంగ పరిషత్తు చైర్మన్ బాబు రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ పరిషత్ ముసాయిదా కమిటీకమిటీకమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ఎంతో మేధావులు భారత రాజ్యాంగాన్ని లిఖితపూర్వకంగా రచించడం జరిగింది. మనదేశంలో 2015 నవంబర్ 26న మొదటిసారిగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించడం ప్రపంచ దేశాల్లో కన్నా లిఖితపూర్వకమైన రాజ్యాంగాన్ని మనం రచించుకొని అమలు చేసుకోవడం జరుగుతున్నది స్వతంత్ర సమాజ సమరయోధులు రాజ్యాంగ నిర్మాతలు న్యాయ శాస్త్ర కోవిదులు ఎందరో మహనీయులు రాజ్యాంగ రూపకల్పంలో భాగస్వాములు అయ్యారు. ప్రత్యేకంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ ఎన్.గోపాలస్వామి అయ్యర్ సయ్యద్మహమ్మద్ సదుల్లా డాక్టర్ కెఎం మున్షి లాంటి ఎందరో మహానుభావులు భారత రాజ్యాంగాన్ని రచించినారని పేర్కొన్నారు. ఈ రాజ్యాంగానికి ఆత్మ భారతరత్న బిఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి ప్రజాస్వామిక వ్యవస్థను సుసంపనం చేసి అసమానతలు లేని వివక్షత లేని పీడనలేని సమ సమాజ నిర్మాణం కొరకు ప్రజాప్రతినిధులు మేధావులు ప్రజాస్వామ్యవాదులు నిరంతరం కృషి చేయాలని కోరారు.

# ఘనంగా భారతరాజ్యాంగ దినోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డి పల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం భారతరాజ్యాంగ దినోత్సవం, సాంఘికశాస్త్ర దినోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పోతులూరయ్య ఆధ్వర్యంలో భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిద పోటీల్లో విజేతలకు బహుమతీప్రధానం గావించారు. సాంఘిక ఃశాస్త్ర ఉపాధ్యాయుడుగా కొనసాగి ప్రధానోపాధ్యాయుడుగా ఉద్యోగోన్నతి పొందిన వి.పోతులూరయ్యను, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పార్లపల్లి నాగరాజారావును ఉపాధ్యాయులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా హెడ్మాస్టర్ పోతులూరయ్య ప్రసంగిస్తూ ప్రజసాస్వామ్య భారతదేశంలో రాజ్యాంగం ఆధారంగానే పాలన సాగుతుందన్నారు. ప్రతి ఏటా నవంబర్ 26వ తేదీన రాజ్యాంగదినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఇదేరోజును చట్టదినోత్సవంగా కూడా జరుపుకుంటుంటా మన్నారు. 1949లో నవంబర్26వతేదీన భారతదేశం రాజ్యాంగాన్ని దత్తత తీసుకొని 1950 జనవరి 26 నుండి అమలులోకి తీసుకొచ్చారని ఆయన వివరించారు. ప్రతిఏటా ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవంగా, జనవరి26న గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటుంటామని పోతులూరయ్య పేర్కొన్నారు. భారతరాజ్యాంగ ప్రతిని రూపొందించిన రాజ్యాంగ కమిటీకి డాక్టర్ అంబేద్కర్ అధ్యక్షుడుగా వ్యవహరించారని, ఈరాజ్యాంగం పాలన సజావుగా, అందరి హక్కులు పరిరక్షించేలా, అందరి సంక్షేమం సాగించేలా రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రాధాన్యం, అంబేద్కర్ ఆశయాలను ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.పోతులూరయ్య, ఉపాధ్యాయులు పార్లపల్లి నాగరాజారావు, ఆర్.వెంకటేశ్వర్లు, కె.సుబ్రహ్మణ్యం, పి.ప్రసాద్, డి.మహబూబ్‌ఖాన్, పిడి ఎస్.శ్రీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రవాణా కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని రవాణాశాఖ కార్యాలయంలో మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు ఆధ్వర్యంలో భారతరాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంవిఐ రాములు భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి రాజ్యాంగం అత్యంత ప్రాధాన్యమైనదని, ఈ రాజ్యాంగంతోనే పాలన అత్యంత సజావుగా సాగుతుందని, భారతదేశ పాలనకు రాజ్యాంగం ప్రధాన దిక్సూచిగా ఉందన్నారు. అందరి సంక్షేమానికి, అందరి హక్కుల పరిరక్షణకుఅనుగుణంగా రాజ్యాంగం రచించబడిం దన్నారు. రాజ్యాంగాన్ని దత్తత తీసుకున్న రోజు నవంబర్ 26వ తేదీ అని, ఇదే రోజు అందరం రాజ్యాంగదినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని రాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రగడ వర్ధంతి వేడుకలు




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రజాబంధు ప్రగడ కోటయ్య 30వ వర్ధంతి నెల్లూరు నగరంలోని డాక్టర్ మారం సుధాకర్ మన హాస్పిటల్ ప్రాంగణమునందు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ.. ప్రజాబంధు ప్రగడ కోటయ్య జీవితకాలం చేనేతల సమస్యల మీద చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డారని ఆ మహానుభావుడు చూపిన దారిలో నేడు పనిచేస్తున్న నాయకులూ కూడా పయనించాలని, ఆయన యొక్క ఆశయాలను సాధించాలని ఆయన అన్నారు. ప్రగడ కోటయ్య తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో పదవులు అధిరోహించారని ప్రతి పదవికిఆయన ఎంతో గుర్తింపు ప్రాముఖ్యత వచ్చే విధంగా పనిచేశారనీ పాల్గొన్న చేనేత ప్రతినిధులందరూ ముక్తకంఠంతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా ప్రతినిధులు జానపాటి రామసుబ్బయ్య, సోమ గోపాల్, దోనేపూడి కోటేశ్వరరావు, సోమా పురంధర్, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# గొట్టిపాటి ప్రసాద్ హత్య హేయమైన చర్య

## ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం గట్టుపల్లి పంచాయతీ చింతల పాలెం గ్రామానికి చెందిన గొట్టిపాటి ప్రసాద్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అతి దారుణంగా బుధవారం హత్య చేశారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గొట్టిపాటి ప్రసాద్ హత్య హేయమైన చర్య అని దీని వెనుక ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే బొల్లినేని



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. హత్యకు గల కారణాలను లోతుగా దర్యాప్తు చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రసాద్ తనకు ఎంతో సన్నిహిత వ్యక్తి అని గుర్తు చేశారు. ఈ ఘటన నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

# శ్రీ చైతన్య పాఠశాల రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్క రించుకొని ర్యాలీ కార్యక్రమాన్నీ నిర్వహించారు. స్థానిక పాఠశాల నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల కృష్ణ, డీన్ మస్తాన్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులకు రాజ్యాంగం తయారీ ప్రాధాన్యతను గురించి వివరించారు. రాజ్యాంగ ఆవశ్యకత ఒక దేశానికి ఎలా అవసరమవుతుందో తెలియజేశారు. రాజ్యాంగం దేశానికి ఏ విధంగా సూచికగా ఉంటుందో తెలియజేశారు. రాజ్యాంగం లేని రాజ్యం చూక్కానిలేని నావలాంటిదని తెలిపారు. రాజ్యాంగాన్ని అందరం గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దివ్య కృష్ణారెడ్డి మనోజ్ షేక్ బాషా బోధన బోధ నేతర సిబ్బంది ఉన్నారు.

# మర్రిపాడులో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి తహసీల్దార్ అనీల్ కుమార్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగం పట్ల అంబేద్కర్ చేసినటువంటి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా కృష్ణపట్నం బాలాలయాల విగ్రహాలు నిమజ్జనం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన బాలాలయాల విగ్రహాలకు బుధవారం వేద పండితులు శాస్త్రోక్తంగా అగమ శాస్త్రం ప్రకారం సంప్రోక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గిరికృష్ణ, చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, మండల తెలుగు యువత కమిటీ అధ్యక్షుడు రాగాల శివకృష్ణ, ట్రష్టీ మండలి సభ్యులు సమక్షంలో బ్రాహ్మణులు సంప్రోక్షణ చేశారు. పూజలు అనంతరం బాలాలయ విగ్రహాలను కృష్ణపట్నం సముద్ర జలాల్లో జల విసర్జన చేశారు. ఈ కార్యక్రమం గురించి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాట్లాడారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశామని గ్రామస్తులు సహకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాతిపల్లి గ్రామంలో రైతన్నా.. మీ కోసం

**రాపూరు, మేజర్‌న్యూస్ :** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి టీఎన్ ప్రసాద్ నాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం రాపూరు మండలంలోని తాతిపల్లి గ్రామంలో రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ విధానాలతోపాటు వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలకు సంబంధించి వివరాలను రైతులకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల పొలాలు కబ్జాలు కాకుండా కాపాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత రబి సీజన్ లో రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ప్రభుత్వం హమాలీ కూలీలతో సహ రైతుల ఖాతాలలో డబ్బులు వేసిన విషయాన్ని కూడా ఆయన అన్నదాతలకు వివరించారు. మారుతున్న కాలంతో పాటు ప్రజల ఆహార అలవాట్లు మారాయని మార్కెట్‌లో డిమాండ్ వుండే పంటలనే రైతులు పండించాలని ప్రసాద్ నాయుడు సూచించారు. పాడిరైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు యూనిట్ రూ. 1.50లకే విద్యుత్ సరఫరా తదితర విషయాలను రైతులకు వివరించారు. రైతుల సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు



అన్నదాత సుఖీభవ పథకాన్ని 2 విడతలుగా అమలు రైతులకు అండగా నిలిచామన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు చదువుకుంటున్న కారణంగా వ్యవసాయ రంగంలో కూలీల కొరత తప్పదని సాగుకు టెక్నాలజీ తోడైతే రైతులకు తిరుగుండదన్నారు. రైతు బిడ్డలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రం సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా పయనిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వ చిత్తశుద్ధిని ఆయన ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శివాజీ, సిద్దేశ్వర రావు, రాజగోపాల్, వెంకట స్వామి, పుల్లయ్య, జయ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏడీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని ఏడీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగ్లా సెంటర్లోనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఏడిపిఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు గుజ్జు చెన్నయ్య మాట్లాడుతూ.. 1946లో రాజ్యాంగ పరిషత్ ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారని 1949లో నవంబర్ 26న ఆమోదించారని తెలిపారు. ఈ రాజ్యాంగం తయారు కావడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం పట్టిందని దీనికంతటికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యొక్క కృషి ప్రధానంగా ఉందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచ దేశాల రాజ్యాంగాలలోని మన దేశానికి అనుకూలమైన అంశాలను సేకరించి అతిపెద్ద రాజ్యాంగంగా రూపొందించారన్నారు. ఆర్థిక సాంఘిక ఆర్థిక రాజకీయ ఆలోచన సమాన అవకాశం కల్పించిందన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైన, పెద్దదైన లిఖిత అలిఖిత రాజ్యాంగం అన్నారు ఇలాంటి రాజ్యాంగం అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దేటి చెన్నయ్య, బీఈడీ చెన్నయ్య, ఆరికొండ సురేష్, ఆరికొండ శ్రీనివాసులు, బాలకేశవులు, శ్రీరాం, శ్రీనివాసులు, ఎస్.కృష్ణ, ఎన్.బాలకృష్ణ, ఎన్నుపల్లి నరేష్ తదితరులు ఉన్నారు.

# జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం

**కావలి, మేజర్‌న్యూస్ :** జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొలిటికల్ సైన్స్ పెద్దలైన నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 1949 నవంబర్ 26న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తయారు చేసిన రాజ్యాంగ పుస్తకాన్ని అధికారికంగా రాజ్యాంగ సభ ఆమోదించడం జరిగిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా ప్రతి సంవత్సరం మనం జరుపుకుంటున్నామని విద్యార్థిని, విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్రాంతి చరిత్ర అధ్యాపకులు డాక్టర్. జక్కుల కృష్ణా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగం కేవలం పరిపాలన నియమాల పుస్తకం కాదని అది న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలకు మార్గదర్శకమైన పవిత్ర గ్రంథం అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలు కూడా స్పష్టంగా



ఉద్దేశించిందని బాధ్యతలను ఎవరికి వారు వారి వారి కర్తవ్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్స్ డైరెక్టర్ ఆర్.మలాద్రి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, జాతీయ ఏకత్వం, దిశగా అడుగులు వేస్తేనే రాజ్యాంగ స్ఫూర్తిని నింపుకున్న వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి పాఠశాల నందు జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలలో ఎంఈఓటి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో దేశాల రాజ్యాంగంలోని విశిష్ట లక్షణాల చేకూర్పుతో భారత రాజ్యాంగం ఒక గొప్ప రాజ్యాంగంగా రూపొందిందని భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు తమకు తాముగా రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు ఈ నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటామని



భారత రాజ్యాంగ విశిష్టత గురించి తెలియజేశారు. తదుపరి డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనమును పరిశీలిస్తూ మెనూ ప్రకారం ప్రతిరోజు రుచి శుచి కరముగా భోజనం తయారుచేయవలనని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల లైబ్రరీ, సైన్స్ ప్రయోగశాలలను పరిశీలించారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ గోపీక్రిష్ణ అంబేద్కర్ చిత్రపటాని పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జె.మాధవరావు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాల చెన్నయ్యకు ఢిల్లీలో కాన్స్టిట్యూషన్ అవార్డు




**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** న్యూఢిల్లీలో సీనియర్ దళిత నాయకులు డాక్టర్ బాలచెన్నయ్య కాన్స్టిట్యూషన్ అవార్డు అందుకున్నారు. 76వ కాన్స్టిట్యూషనల్ డే సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రి సోషల్ జస్టిస్ మంజి చేతుల మీదగా ఈ అవార్డు తీసుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున సాంఘిక, సామాజిక సేవా రంగాలతోపాటు దళిత వర్గాలలో సర్వే చేసినందుకు డాక్టర్ అంబేద్కర్ కాన్స్టిట్యూషన్ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని బొమ్మిళ్ళ బాల చెన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఒంగోలు రాఘవేంద్ర, కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. తొలిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం పలువురు అంబేద్కర్ గురించి వివరించారు. బడుగులకు ఆయన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావడం జరిగింది, ప్రదీప్ రెడ్డి, కలిగిరి మండల కన్వీనర్, కాటం రవీందర్ రెడ్డి, అక్కి భాస్కర్ రెడ్డి, ఎంపీ వెంకట రమణయ్య, ఎంఎ.సలీం, యు.గురవయ్య, ఎస్సీ సెల్ ఉదయగిరి, దస్తగిరి అహ్మద్, తిరుపాలు, దావులూరి వెంకటేష్, పెంచలయ్య, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజేత విద్యార్థులకు బహుమతి ప్రధానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని నడిమూరు నందలి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు ప్రధానం చేశారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని 14వ తేదీన ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులకు బేటి బచావో బేటి పడావో అంశంపై నిర్వహించినవ్యాసరచన పోటీలలో విజేతలైన బాలికలకు బుధవారం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమ సందర్భంగా సీడీపీఓ పద్మజ కుమారి ప్రధానోపాధ్యాయిని నాగలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వాటి దుష్పరిణామాలను తెలియజేశారు. అలాగే బాల్య వివాహాలు జరిగినట్లయితే ప్రభుత్వ హెల్ప్‌లైన్ నెంబర్‌కు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ టి.తేజస్విని పాఠశాల ఉపాధ్యాయ బృందం అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## కాల్చబడిన బీజేపీ జెండా మార్పు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నూతన బీజేపీ జెండాను బీజేపీ మూలాపేట మండల కార్యకర్తలు ఆవిష్కరించారు. గత మూడు రోజుల క్రితం కార్యకర్తలు గమనించినప్పుడు హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో బీజేపీ స్థూపంపై ఉన్న జెండాను కిందకు లాగి ఉండడం కొంత భాగం జండా కాల్చబడి ఉండడాన్ని గుర్తించాము. ఆస్థానంలో తిరిగి నూతన జెండాను మార్చుకున్నామని బీజేపీ నేత మిడతల రమేష్ తెలిపారు. ఎలా కాలిందో తెలియదు. యాదృచ్ఛికంగా కాలిందో లేక ఎవరైనా ఉదేశపూర్వకంగా కాల్చారా అని కూడా ఆలోచించాలసిన అవసరం లేదన్నారు. మోడీ పథకాలను ప్రజల మనసుల్లోకి తీసుకెళ్లి ప్రజల మనసుల్లో బీజేపీ చిహ్నం గుర్తుండేలా కలిసి పని చేద్దామని రమేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేష్రాజేశ్వరమ్మ, పోట్లూరు శ్రీనివాసులు, పద్మావతి, కందుకూరు శివకుమార్, నరాల సుబ్బారెడ్డి, సృజన, ఆదినారాయణ, సుబ్బారావు, రంగరాజన్, సునీల్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# శైక్షణిక క్రెడిట్ భాండారంపై అవగాహన కార్యక్రమం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నూతన జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా ప్రవేశపెట్టిన శైక్షణిక క్రెడిట్ భాండారం (అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్) వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సామాజిక సేవ (సోషల్ వర్క్) విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై శైక్షణిక క్రెడిట్ భాండారం వ్యవస్థ విద్యార్థి, కేంద్రీకృత విద్యా విధానం అమలుకు కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా పాఠ్యాంశాలకు సంబంధించిన క్రెడిట్లు సంపాదించుకునే అవకాశం, వాటిని డిజిటల్ రూపంలో భద్రపరచుకునే సౌకర్యం, అవసరమైతే ఇతర విద్యాసంస్థలకు బదిలీ చేసుకునే వీలును వివరించారు. బహుళ ప్రవేశాలు,బహుళ నిష్క్రమణలు వంటి కొత్త విధానాల విజయానికి ఈ వ్యవస్థ మూలస్తంభంగా పనిచేస్తుందని తెలిపారు. ముఖ్య ప్రసంగకర్తగా జాతీయ విద్యా పరిశోధన మండలి (ఎన్‌సీఈఆర్టీ)-నెల్లూరు ప్రాంతీయ విద్యా సంస్థ ప్రొఫెసర్ ఆచార్య బి.రమేష్ బాబు పాల్గొని, విద్యార్థుల శైక్షణిక వివరాలను డిజిటల్ రూపంలో నిర్వహణ చేయడం, క్రెడిట్ల మార్పిడి విధానం, జాతీయ స్థాయి విద్యా మార్పిడి సౌకర్యం వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు అందించారు. జాతీయ విద్యా విధానం-2020 అందిస్తున్న కొత్త అవకాశాలను విద్యార్థులు సమర్థంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. శైక్షణిక క్రెడిట్ భాండారం వేదికలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవస్థ అమలుకు విశ్వవిద్యాలయం చేపట్టిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. విజయ, పరిక్షల నియంత్రణ అధికారి డా. ఆర్. మధుమతి, జాతీయ విద్యా విధానం నోడల్ అధికారి, పీఎం-ఉష కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.విజయలక్ష్మి, సమన్వయకర్తలు డాక్టర్ కేవీఎల్ కన్యరావు, డాక్టర్ ఎన్ఓ గోపాల్, డాక్టర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం పమిడిపాడులో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సిమెంటురోడ్డు నిర్మాణానికి బుధవారం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పనులను ప్రారంభించేలా ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరి, నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకుడు కేతా విజయభాస్కర్‌రెడ్డిలు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా చౌదరి, విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈపనులను నాణ్యతాప్రమాణాల ప్రకారం సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ రహదారులు సక్రమంగా ఉండాలని, ప్రజలకు అసౌకర్యం లేకుండా ఉండాలన్న లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తుందన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామీణరహదారులు బాగుండాలన్న లక్ష్యంగా ప్రత్యేకశ్రద్ధతో నిధులు మంజూరు చేయిస్తున్నారని వారు తెలిపారు. గ్రామాలకు రోడ్డు,రవాణా సౌకర్యాలుండాలని, అంతర్గత రహదారులు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలన్నదే మంత్రి ఆనం ప్రధాన సంకల్పమని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మాదాల శ్రీనివాసులునాయుడు, మాదాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో రైతు సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నినాదాలతో కూడిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వాలు ఆదాని అంబానీలకు పరిశ్రమలను తాకట్టు పెడుతున్నానన్నారు. కార్పొరేట్ శక్తుల యాజమాన్యాలు కార్మికుల కష్టాన్ని దోచుకునే స్వేచ్ఛ ఇచ్చారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. లేబర్ విద్యుత్ సవరణ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ సిఐటియు నాయకులు కోడే రమణయ్య తిరుపతయ్య కామాక్షమ్మ వెంకటేశ్వర్లు నాయబ్ రైతులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక డీకే బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ వైఓ నందన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులకు ఉండాల్సిన అవగాహనపై కమిషనర్ వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ వర ప్రసాదరావు, నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకోండి : బయ్యన్న



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని ఇల్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సారథ్యంలో నూతన ఇల్లు మంజూరుకు ప్రభుత్వం దరఖాస్తుకు అవకాశం కల్పించిందని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చింతన బోయిన బయ్యాన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.50లక్షలు మంజూ రు చేస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఇల్లు లేని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు స్థానికంగా సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించిందని లబ్దిదారులు అధికారులను, స్థానిక నాయకులను సంప్రదించి నవంబర్ 30 వ తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నారన్నారు. ఆయన సారథ్యంలో నూతన ఇల్లు మంజూరు వచ్చినటువంటి అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే బైపాస్ సర్జరీ విజయవంతం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఇటీవల బైపాస్ సర్జరీ నిర్వహించారు. బుధవారం 39వ వార్డు వైకాపా నాయకులు వెంగళ శెట్టి కళ్యాణి ఆధ్వర్యంలో చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు అభిమానులు శ్రీ కలుగోశాంభవి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేమంగా కోలుకొని ఆయురారోగ్యాలతో కావలి నియోజకవర్గ ప్రజల మధ్యలో ఉండాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పురుషులు, వెంగల్సేటి కళ్యాణి బ్రహ్మారెడ్డి, నూర్ బాషా, శ్రీనివాసులు, కీర్తి దొరసానమ్మ చంటి, పార్థు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలో బాటనే ఆక్రమించారు..



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్నవరం పంచాయతీ పరిధిలో పశువులు మేతకు వెళ్లే బాట ఆక్రమణకు గురైందని అన్నవరం గ్రామ నాయకులు పూనూరు రామకృష్ణారెడ్డి తెలిపారు. చిన్నక్రాక అవుట్ ఫ్లో వద్ద కావలి కాలువకు సాగునీటి విడుదలకు వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి రామకృష్ణారెడ్డి ఈ విషయాన్ని తెలియజేశారు. దాదాపు 100లింకులు ఉండాల్సిన బాట ఆక్రమణ గురై 25లింకులు మించి లేకుండా పోయిందని వేలాది పశువులు, గొర్రెలు ఈ బాటగుండానే చెరువులోకి మేతకు వెళ్తాయన్నారు. సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ఆయన ప్రజల పక్షాన నిలచి అధికారులను వేడుకుంటున్నాడు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం




**రాపూరు, మేజర్‌న్యూస్ :** 76వ రాజ్యాంగ దినోత్సవని రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమనికి ముఖ్యఅథిగా సీవీకే ప్రభుత్వవ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి హాజరయ్యారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.హనుమంతయ్య రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వీవీ రమణారెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు లోని గాయత్రి నగర్ నందలి శ్రీ సుబ్రహ్మణ్య నవోదయ ఎంసెట్, సైనిక శిక్షణ అకాడమీ నందు రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి సంస్థ డైరెక్టర్ బి.సురేంద్ర రాజు మాట్లాడుతూ.. మన భారత రాజ్యాంగాన్ని 1946లో బాబు రాజేంద్రప్రసాద్ ముసాయిదా కమిటీ అధ్యక్షునిగా తయారు చేయబడిందని 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఆమోదించడమైందన్నారు. ఈ రాజ్యాంగాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు నిల్వరామంగా కృషిచేసి ప్రపంచ దేశాలలోని అన్ని రాజ్యాంగాలను పరిశీలించి మన రాజ్యాంగాన్ని తయారు చేశారని తెలిపారు రాజ్యాంగం ఆమోదించబడిన రోజు గనుక దీని రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. రాజ్యాంగంలో ఉన్న పీఠిక మన అందరి ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందన్నారు. సమసమాజ స్థాపనకు దేశ అభివృద్ధికి మార్గదర్శక ఈ రాజ్యాంగం నిలిచిందని ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని అవగాహన చేసుకుని తదనగుణంగా నడుచుకోవాలన్నారు. రాజ్యాంగం లేని దేశం చుక్కానిలేని నావ వంటిదని ఆయన తెలిపారు. అందుకే మేధావులందరూ కలిసి మన రాజ్యాంగాన్ని భారత ప్రజలకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడులోని గ్రంధాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం 11వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో కలిసి పూలమాలవేసి జాతీయగేయం వందేమాతరాన్ని ఆలపించడం జరిగింది. తదుపరి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను విద్యార్థులచే పలికించడం జరిగింది గ్రంథ భాండాగారి రాజ్యాంగ దినోత్సవ ఆవశ్యకత ప్రాముఖ్యతను వివరిస్తూ 2015లో భారత రాజ్యాంగ పితగా పిలుచుకునే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125వ జయంతి ఉత్సవాలను ఘనంగా జరపాలని కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ వేసి ఏడాది పాటు ఉత్సవాల నిర్వహించి అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా రకరకాల కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో 2015 అక్టోబర్‌లో ముంబైలోని అంబేద్కర్ జ్ఞాపిక దగ్గర పునాది రాయి వేస్తూ రాజ్యాంగ దినోత్సవ ప్రకటన చేశారని తెలిపారు. అప్పటినుండి ప్రతి సంవత్సరం నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించారని అన్నారు. ఈ




సందర్భంగా కళాశాల విద్యార్థుల అవగాహన కోసం భారత రాజ్యాంగం పై క్విజ్, కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం 11వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ తరపున ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు చెన్న కృష్ణయ్య, శివ ప్రవీణ్, మహబూబ్ బాషా, సురేష్, శ్రీను, హనుమంత రాజు, జనార్ధన్, ఆఫీస్ సబార్డినేట్ సునీల్ గ్రంథాలయాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# మోంతా తుఫాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మోంతా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన కుటుంబాలకు సహాయంగా చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ, జయవర్ధన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని వీలుకానిపల్లి, వెంకన్నపాలెం, రవీంద్రపురం, శివరాంపురం, కొల్లిదిబ్బ, గణపతి నగర్ గ్రామాల్లో మొత్తం 197 పేద గిరిజన కుటుంబాలకు ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇరగనబోయిన శ్రీనివాసరావు, ఫౌండర్ జయలక్ష్మి, జయవర్ధన్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ గంటా వెంకట రవికుమార్ పాల్గొన్నారు.అదనంగా పేదూరు గ్రామానికి చెందిన సోమిరెడ్డి రేవంత్ రెడ్డి, ముత్యాల సీనయ్య, వీలుకానిపల్లి సర్పంచ్ జి.పావని, వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీలు మురళీకృష్ణ, పెంచలయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు శ్రీనివాస్, పద్మావతి, గురుదేవి, కనకాద్రి, సుజిత్, సంపత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజేడబ్ల్యూఎస్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ గిరిజన బాలికలు, మహిళలకు చైతన్యపరచి బాలివివాహాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదని గ్రామాల్లోని గిరిజన మహిళలతో ప్రమాణం చేయించారు.

# మహనీయుల చిత్రపటాలను తహసిల్దార్ కార్యాలయానికి బహుకరణ

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రావు, పూలే దంపతుల చిత్రపటాలు సైదాపురం తహసిల్దార్ కార్యాలయంలో కనపడకపోవడం గమనార్హం. అయితే ఎమ్మార్పీఎస్ నాయకులు తాసిల్దార్ కార్యాలయం నందు పేద బడుగు బలహీన వర్గాల మహనీయుల చిత్రపటాలు లేకపోవడం గమనించిన సైదాపురం మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, జీర్ణించుకోలేకపోయారు. తక్షణమే స్పందించిన మండల ఎమ్మార్పీఎస్ నాయకులు నక్కిన బోయిన గంగాధర్ మల్లారపు ఏడుకొండలు, నక్కిన బోయిన వెంకటేష్,మల్లారపు పెంచలయ్య, తహసిల్దార్ కార్యాలయంలో తక్షణమే ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం మరియు బాబు జగ్జీవన్ రావ్, పూలే దంపతుల చిత్రపటాలను, మండల తాసిల్దార్ సమక్షంలో తహసిల్దార్ కార్యాలయానికి చిత్రపటాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నక్కెనబోయిన గంగాధర్,



మండల ఉపాధ్యక్షులు మల్లారపు ఏడుకొండలు, నక్కిన బోయిన వెంకటేశ్వర్లు, మల్లారపు పెంచలయ్య ఇదితరులు పాల్గొన్నారు.

## కిశోరి బాలికలకు బాల్య వివాహల అవగాహన



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలంలోని జమ్మలపాలెం ఎంపియుపి పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9వ తరగతుల విద్యార్థిని విద్యార్థినీలకు బాల్య వివాహాలపై, రాజ్యాంగం రూపొందించిన రోజుకు సంబంధించిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జలదంకి సెక్టార్ సూపర్వైజర్ సుహాసిని విద్యార్థులకు ఆరోగ్యం ఆహారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. రవి, బి.మాల్యాద్రి, కుసుమ, అంగన్వాడీ కార్యకర్తలు కె.స్రవంతి, జె.మౌనిక, డి.ఇంద్రాణి, వి.సుజాతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోండి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ మత్స్య అభివృద్ధి మండలి నిధులు ద్వారా మత్స్య రైతులకు అందిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను సద్విని యోగం చేసుకోవాలని ప్రభుత్వ శాఖల అధికారులు అన్నారు. బుధవారం మండల కేంద్రం మత్స్య కళాశాలలో మత్స్య రైతులకు మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాయి. చేపల ప్రజననం, నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తి అంశం పైన జిల్లాస్థాయిలో ఈ శిక్షణ కల్పించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి చేపల పెంపకం రైతులు హాజరయ్యారు. నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ బాబు చేపల పెంపకంపై క్షేత్రస్థాయిలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ కే.ధనపాల్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ ఎన్.మాధవన్, ట్రైనింగ్ ఆర్గనైజర్ డాక్టర్ పి.ఆనంద ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచలం కార్తీక దీపంలో మీ కోసం, మీ కుటుంబ సభ్యుల కోసం దివ్య దీపం వెలిగించండి!




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రియమైన భక్తుడా.. ఈ డిసెంబర్‌లో, పవిత్రమైన అరుణాచలం కార్తీక దీపం పండుగ సందర్భంగా, శ్రీ నంది ఫౌండేషన్ సాధువులు, సన్యాసులతో దీపం వెలిగించడం, దీపం దానం, గిరిప్రదక్షిణ సేవను నిర్వహిస్తోంది. డిసెంబర్ 1 నుండి డిసెంబర్ 12 వరకు ఈ ఉద్యమంలో చేరండి. ప్రతి దీపానికి కేవలం రూ.251 చెల్లించి, మీరు ప్రతి కుటుంబ సభ్యుని తరపున దీపం సమర్పించవచ్చు. **అరుణాచలం వద్ద దీపం వెలిగించడం అంటే :** గత కర్మలను తొలగించండి. కుటుంబానికి శాంతి, శ్రేయస్సును తీసుకురండి అరుణాచలేశ్వరుని ఆశీస్సులు పొందండి. పవిత్ర పర్వతం వద్ద దీపం సమర్పించడం ద్వారా మీ మొత్తం కుటుంబం ఆశీర్వదించబడనివ్వండి. పండుగ రోజుకు ముందు పరిమిత సేవా రిజిస్ట్రేషన్లు. మీ దీపాన్ని ఇప్పుడే బుక్ చేసుకోండి! **ముగింపు పంక్తి :** ఒక దీపం.. అనంతమైన ఆశీస్సు

## పది విద్యార్థులకు బిజివేముల చేయూత



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని మర్రిపాడు విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత రెండు రోజుల క్రితం టీడీపీ సీనియర్ నాయకులు బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి మండలంలోని పదవ తరగతి చదువుతున్న 310మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించేందుకు ఎంఈఓ తిరుపతయ్యకు హామీ ఇచ్చిన విషయం విధితమే. ఈ సందర్భంగా బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి మిత్రుడు బూదవాడ సొసైటీ చైర్మన్ వనిపెంట సుబ్బారెడ్డి అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారి తిరుపతయ్య చేతుల మీదుగా విద్యార్థుల ఫీజులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఎంఈఓ చెక్కులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేసి విద్యార్థుల పట్ల విద్య పట్ల గొప్ప మనసు చాటుకున్న బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## సోమశిల డ్యామ్, కెనాల్‌ను పరిశీలించిన బీజేపీ నేతలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయాన్ని, సోమశిల కండలేరు వరద కాలువను, చిన్న కాలువను బీజేపీ నమామిగంగే, రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమశిల డ్యామ్, కండలేరు డ్యామ్ రెండు డ్యాములు నెల్లూరు జిల్లా నిర్వహణ పరిధిలో ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్‌కెఎఫ్‌ఎఫ్ కెనాల్ రెండు జలాశయాలను అనుసంధానం చేస్తూ ఉంది. అలాగే రెండు రాష్ట్రాల నీటి అవసరాలను తీరుస్తుంది. నీటి కరువు సంక్షోభం ఎదురైనప్పుడు రెండు జలాశయాల క్రింద రైతాంగం ప్రయోజనాలు పొందాలంటే ఒక జిల్లా అడ్మినిస్ట్రేషన్ పరిధిలో రెండు జలాశయాలు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. రెవిట్మెంట్లు దెబ్బ తినడం. బ్రీచ్చులకు శాశ్వతం మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది. 350 కోట్లతో కండలేరు మట్టి కట్టను వెడల్పుచేయాల్సింది. రెండు జలాశయాలను నెల్లూరు జిల్లాలో కొనసాగించాలని రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నరాల సుబ్బారెడ్డి, నీలి శెట్టి లక్ష్మణరావు, చింత గింజల సుబ్రమణ్యం, పూల ప్రశాంత్, సురేష్‌లు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) బుధవారం విద్యా, క్రీడా కార్యక్రమాలతో సందడిగా మారింది. ఉదయం నిర్వహించిన 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు, అనంతరం ప్రారంభమైన ఇంటర్‌కాలేజియేట్ పురుషుల క్రీడా టోర్నమెంట్ విశ్వవిద్యాలయాన్ని ఉత్సాహభరిత వాతావరణంతో అలరించాయి. రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు పిలుపు పోలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన దారిలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రీయాంబుల్‌లోని విలువలను చదివేంత మాత్రాన కాదు, ఆచరణలో పెట్టాలని వీసీ పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ టీ.మాధవి, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి రాజ్యాంగంలోని సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎస్సే, ఎలక్యూషన్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్‌కాలేజియేట్ మెన్ గేమ్స్ టోర్నమెంట్‌కు శుభారంభం తర్వాత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇంటర్ కాలేజియేట్ పురుషుల క్రీడా టోర్నమెంట్‌ను వీసీ అల్లం శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించడం ద్వారా ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వం, జట్టు భావన పెంపొందించడానికి ఎంతగానో సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో క్రీడా



వసతుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నట్టు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల శారీరక–మానసిక వికాసానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. విభాగాల వారీగా విజేతల జాబితా టోర్నమెంట్‌లో విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న 16 కళాశాలల నుంచి 270 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

**విభాగాల వారీ విజేతలు :** బాల్ బ్యాట్మింటన్ విన్నర్స్ జేబీ డిగ్రీ కళాశాల, కావలి, రన్నర్స్ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు, సాఫ్ట్ బాల్ విన్నర్స్ వీఎస్‌యూ, నెల్లూరు, రన్నర్స్ డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల, ఆత్మకూరు, బాడీ బిల్డింగ్ విన్నర్స్ జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల, నెల్లూరు, రన్నర్స్ వీఎస్‌యూ కళాశాల, నెల్లూరు, యోగవిన్నర్స్ వీఎస్‌యూ కళాశాల, కావలి, రన్నర్స్ జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల, నెల్లూరు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ వెంకటరాయులు, టోర్నమెంట్ పరిశీలకులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని ముదురుపాడులో డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎంఎల్ ఎస్.దేవకుమార్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1949నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదించబడిన రోజును గుర్తిస్తూ, ప్రతి సంవత్సరం ఈరోజును దేశ వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడి ఇప్పటికీ 76 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. ఈ రాజ్యాంగం మనకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా ఇచ్చిందని వాటిని మనం బాధ్యతగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దాంశెట్టి సుదీర్ నాయుడు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రచించడానికి రెండు సంవత్సరాల 11నెల 18 రోజుల సమయం పట్టిందని ఎన్నో దేశాల రాజ్యాంగాలను విపులంగా పరిశీలించి వాటిలోనే మంచిని తీసుకొని భారత రాజ్యాంగాన్ని రచించి ఆమోదించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చి మన దేశం గణతంత్ర రాజ్యాంగ మారిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు మాట్లాడుతూ.. అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగమును రూపొందించి ఆమోదించడం జరిగిందని, నీటి బావితర పౌరులు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో జి.రమేష్ బాబు వివిధ భాగాల అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం జరుపు కుంటున్నామని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని నడిపించే పరమాధికార పత్రం రాజ్యాంగం ఆవిర్భవించిన రోజును స్మరించుకునే వేడుక అని పేర్కొన్నారు. ఈరోజు రాజ్యాంగాన్ని రచించిన నాయకుల దూర దృష్టి కృషి, ప్రజా సంకల్పాన్ని గుర్తు చేసుకోవడమే కాదు ప్రతి పౌరుడు తన హక్కులు బాధ్యతలు, విలువలపై ఆత్మ పరిశీల చేయాల్సిన రోజుగా కూడా నిలుస్తుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. మన రాజ్యాంగం అనేక గొప్ప మేధావుల స్వాతంత్ర సమరయోధుల న్యాయనిపుణుల మేధస్సు సమ్మేళనం అని తెలిపారు. రచనా కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ శిల్పిగా ప్రసిద్ధి అని ఆయన న్యాయపరమైన ప్రావీణ్యం సమానత్వం పై దృఢ నమ్మకం రాజ్యాంగానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ రాజేంద్రప్రసాద్ పండిత్ జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, కేఎం వంశీ, బీఎం రావు, టి.కృష్ణమాచారి వంటి అనేక మంది తమ మేధస్సునందించారని న్యాయమూర్తి పేర్కొన్నారు. అందరికంటే ముఖ్యంగా వారు భారత భిన్నత్వం సమగ్రత ప్రజాస్వామ్య విలువలను రాజ్యాంగంలో ప్రతిపలింప చేశారని కూడా పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అత్యంత విలువలపై నిర్మించబడిందని న్యాయం సామాజిక ఆర్థిక రాజకీయ విలువలు స్వేచ్ఛ ఆలోచన వ్యక్తీకరణ విశ్వాసం మతాచారణ సమానత్వం హోదా, అవకాశాలు సోదర భావం వ్యక్తి గౌరవం, జాతీయ ఐక్యత తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించారని న్యాయమూర్తి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.గీత, ఎన్.సరస్వతి ఎల్.తేజోవతి,




కే.శ్రీనివాసరావు, నికిత, ఐ.కరుణ కుమార్ కే.వాణి, గోరంట్ల స్వాతి, షేక్ అబ్దుల్ రెహమాన్ ఎల్.శారదరెడ్డి, నిషాద్ నాజ్ షేక్, సిఆర్ సుమలతలు పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తి శ్రీనివాస్ తదితర న్యాయమూర్తులు భారత రాజ్యాంగం విలువలను కాపాడుతామని ప్రమాణం చేశారు.

# టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్ నాయుడు హత్య

## మృతదేహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలో బుధవారం టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్ నాయుడు కోళ్ల ఫారంలో వుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అత్యంత కిరాతకంగా గొంతు కోసి హత్య చేశారు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, హత్యకు సంబంధించిన వివరాలను పోలీసుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ నాయుడు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఎమ్మెల్యే ఓదార్చి, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

# అనధికారంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం బోగోలు మండలంలో అనధికారికంగా మద్యం సీసాలు కలిగి ఉన్న చెట్టుపల్లి వెంకయ్య తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి ప్రస్తుతం బోగోలులో విశ్వనాథరావు పేటలో నివాసం ఉంటున్నారు. ఈ వ్యక్తి వద్ద సుమారు 50 సీసాలు 250ఎంఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి పి.అనిత వారి సిబ్బందితో కలిసి ఈ దాడులు నిర్వహించి ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కావలి ఎక్సైజ్ అండ్ ప్రొఫెషన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం కావలి అధికారులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# బోదకాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బోధకాలు వ్యాది నివారణకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయిలో సమగ్రమైన చర్యలు తీసుకుంటూ నివారణ అరికట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని మండల వైద్యాధికారిని దేవికృప అన్నారు. ఫైలేరియా వ్యాది నిర్ధారణ కోసం జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి సూచనలతో ఈ రక్త పూతలు తీసి పరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు రోజులు మండలంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని బుధవారం నారికేళపల్లిలో ప్రారంభించి మాట్లాడారు. మరో రెండు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. క్యూలెక్స్ దోమ కాటువలన బోధకాలు వస్తుదని పేర్కొన్నారు. దోమకాటు ప్రభావానికి లోనైన వ్యక్తుల శరీరంలో అంతర్లీనంగా ఉడే క్రిమిని గుర్తించి బోధకాలు వ్యాదిని అరికట్టేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైసర్లు మార్క్, నిర్మలమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ బూదూరు బాలకృష్ణ, కళ్యాణ్ కుమార్, రాజగోపాల్, నవీన్, ఎంఎల్ హెచ్ పిలురేఖ ఫాతిమ, ఏఎన్ఎంలు శైలజ, శేషమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభం

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం గౌరవరం ప్రాంతంలో రీమోడల్ చేసి నూతనంగా మంచి రుచికరమైన భోజనాలతో అనుభవజ్ఞులైన వంట మాస్టర్లతో అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు కల్పిస్తూ బుధవారం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రెబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులు చేజర్ల శ్రీనివాసులరెడ్డి వారి దంపతులను ఆశీర్వదించి, అభినందించారు. వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించి వారి మనసులను మంచిని సంపాదించుకోవాలన్నారు.

# రైతుల కోసమే చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుంది



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రైతుల కోసమే తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తుందని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ తెలుగు యువత కమిటీ ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీనాథ్ అన్నారు. బుధవారం ఆయన వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని బండ్లపాలెం గ్రామంలో రైతన్న మీకోసం రైతన్న సేవలో ఒక మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక రైతులతో కలిసి నిర్వహించారు. ఆయనతోపాటు వ్యవసాయ శాఖ అధికారుల బృందం ఉంది. ఈ సందర్భంగా రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు తదితర విషయాల గురించి తెలియజేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేసామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు అండగా వుంటా.. : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

- గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కోవూరు నుంచి మొదలైంది
- యానాది కార్పొరేషన్ కోసం కృషి చేస్తాను
- గిరిజన సమస్యలపై శాసనసభలో గళమెత్తి ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చాను
- ప్రజాసేవ చేసేందుకే రాజకీయాలలోకి వచ్చాను
- ఏఆర్‌డీ స్వక్షంద సేవా సంస్థ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ
- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సామాజికంగా వెనుకబడి వున్న గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాటుపడతానన్నారు. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో ఏఆర్‌డి స్వక్షంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె 500గిరిజన కుటుం బాలకు నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. గిరిజనుల వెనుకబాటు తనంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలంటే కావలసిన కానీస ఆధార్ కార్డు గుర్తింపుకు కూడా నోచుకోని గిరి పుత్రుల దీన పరిస్థితి తెలుసుకొని జిల్లాలో గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ డ్రైవ్ చేపట్టింది కోవూరు నియోజకవర్గం నుంచేనన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసారు. పేదరికంలో వున్న గిరిజనులను ఆడుకునేందుకై కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 1985 గిరిజన కుటుంబాలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు పంపిణి చేస్తున్న ఏఆర్‌డి స్వక్షంద సేవా సంస్థ నిర్వాహకులు బషీర్‌ని అభినందించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజాసేవ చేస్తున్న తాను సైతం విస్తృత స్థాయిలో ప్రజాసేవ చేసేందుకుకే రాజకీయాలలోకి వచ్చినట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని తన నివాసం ఏదోఒక పనిపై వచ్చేవారితో నిత్యం జనసందడిగా ఉంటుందన్నారు. ఆపదలో వున్న వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతోనే తన రాజకీయ ప్రయాణం మొదలైందని తెలిపారు. కార్యదక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలలో వుంటూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని చంద్రబాబు సూచనల మేరకు ప్రజలతో మమేకమై పని చేస్తున్నట్టు వివరించారు. యానాది కార్పొరేషన్ సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గిరిజనులకు హామీ యిచ్చారు. ప్రతి శాసనసభ సమావేశంలో గిరిజన సమస్యలపై గళమెత్తి ముఖ్యమంత్రి దృష్టికి తెస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విడవలూరు టిడిపి అధ్యక్షులు ఏటూరి శ్రీహరిరెడ్డి, టిడిపి నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, ఆడపాల జనార్దన్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, సత్యంరెడ్డి, రామిశెట్టి వెంకటరర్లు, ఏసోబు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత జీవనం సాధ్యం : కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నత జీవనం సాధ్యమని, వ్యక్తి స్వభావం, అలవాట్లు, నైపుణ్యాలు, ఆలోచనా విధానంలో స్థిరమైన అభివృద్ధిని సాధించడమే వ్యక్తిత్వ వికాసం అని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ వివరించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ చిరంజీవి రెండు రోజుల పాటు స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సక్సెస్ మంత్ర శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, కళాశాలల విద్యార్థుల కోసం రూపొందించిన శిక్షణా తరగతులకు సంభందించిన అన్ని ఏర్పాట్లను కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, జేఏసీ పీ4 బృందాలు ప్రత్యేక చొరవ తీసుకుని పర్యవేక్షించారు. శిక్షణా కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రసంగించారు. వ్యక్తిత్వ వికాసానికి వివిధ విశిష్టతలు ఉన్నాయని, వాటిలో ముఖ్యంగా ఆత్మ విశ్వాసం పెంపొందించుకుంటే ధైర్యం, నమ్మకం పెరిగి సవాళ్లను ఎదుర్కోవడంలో ధైర్యాన్ని కలిగిస్తుందని వివరించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలు పాటిస్తూ నిజాయితీగా మెలగాలని, అర్థవంతమైన ప్రవర్తనతో సమాజంలోని ఇతరులతో మంచి సంబంధాలు కలుగుతాయని వివరించారు. వ్యక్తిత్వ వికాసం శిక్షణ ద్వారా సామాజిక నైపుణ్యాలు పెరిగి ఇతరులతో వ్యవహరించడంలో ప్రావీణ్యత సాధించగలమని తెలిపారు. వ్యక్తిత్వ వికాస విశిష్టతలు వ్యక్తిని ఉత్తమమైన వారిగా తీర్చిదిద్దడంలో సహాయపడతాయని, సమాజంలో, తన జీవితంలో శ్రేయస్సును పెంచుకోవడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని కమిషనర్ వెల్లడించారు. శిక్షణ తరగతులను అన్ని విభాగాల వారు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, జిల్లా స్థాయి మున్సిపల్ సిబ్బందికి జనవరి నెలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నామని కమిషనర్ తెలిపారు. వ్యక్తిత్వ వికాసం నిపుణులు డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ.. శిక్షణలో భాగంగా సచివాలయం కార్యదర్శులు సంధించిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు అందించారు. శిక్షణ ద్వారా కొంతమంది జీవితాల్లో అయినా ఉన్నతమైన మార్పును కలిగించేలా ప్రేరణ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇంగ్లీష్ సులభంగా నేర్చుకునేందుకు డాక్టర్ చిరంజీవి రచించిన 'ఇంగ్లీష్ బాస్' పుస్తకాల సంపుటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మో హన్ రావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మలేరియా విభాగం అధికారి డాక్టర్ జిజియా బాయి, టీపీఆర్ఓ వాసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# పొదలకూరులో సోమిరెడ్డి సుడిగాలి పర్యటన

## పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం పొదలకూరు మండలంలో సుడిగాలి పర్యటన జరిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పొదలకూరు పట్టణంలోని వినాయక మాన్యం వద్ద జల జీవన్ మిషన్‌లో రూ. 2.42కోట్లతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకానికి ప్రారంభోత్సవం చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా రూ.92 లక్షలతో నిర్మించనున్న సొసైటీ కార్యాలయం, బ్యాంకు భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మర్రిపల్లిలో తాగునీటి పైప్లైన్‌కు ప్రారంభోత్సవం చేశారు. కాగా కొత్తకం భాలపల్లి వద్ద డ్యామ్ రోడ్ సెంటర్‌లో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి సెంట్రల్ బ్యాంక్ నుంచి కేవలం 3శాతం వడ్డీతో రూ. 2కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు సిఎస్సార్ ఫండ్స్‌తో సర్వేపల్లి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ తలచిరు మస్తాన్‌బాబు, ఏఎంసి చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంపులూరు అరుణ, పీఏసీఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, పిన్నెల ప్రభాకర్, టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడు గుర్రం మీరా మధు, నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కలగట్ల సందీప్, ఆదాల సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఠాగూర్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం (ఇండియన్ కాన్స్టిట్యూషన్ డే) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆ తర్వాత 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఇండియన్ కాన్స్టిట్యూషన్‌పై క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామిరెడ్డి, కరస్పాండెంట్ సిహెచ్ వెంకట రమణారెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజుగా చేయడం కోసమే నిరంతరం పనిచేస్తుందని ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు అన్నారు. ఆయన బుధవారం మర్రిపాడు మండలంలోని ఇర్లపాడు గ్రామంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి తిరిగి రైతన్న మీకోసం కరపత్రాలను పంచి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు ఉన్న రైతుల వివరాలను అధికారులకు నివేదిక పంపించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు రాజుగా చేసేందుకు ఐదు విధానాలతో అమలు చేయుచున్న కార్యాచరణను రూపొందించి ముందుకు వెళుతుందన్నారు. అందుకు సంబంధించిన వివరాలను అంటే నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్కు, ఫుడ్ ప్రాసెసింగ్, మద్దతు ధర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.కవిత మండల విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక అధికారి రామకృష్ణ, సర్పంచ్ శ్రీనివాసులు, గుర్రం నాగేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత దారుణ హత్య





మృతుని ఫైల్‌ఫోటో

**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గట్టుపల్లి చింతలపాలెం గ్రామం టీడీపీ నాయకులు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు బుధవారం పట్టపగలే హత్యకు గురయ్యాడు. ఐదు కేజీలు కోళ్లు కావాలంటూ ప్రసాద్ నాయుడుకు చెందిన కోళ్ల ఫారంకు వచ్చిన వ్యక్తులు ఈ హత్యకు ఒడిగట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. గొంతు కోసి కత్తితో పొడిచిన గాయాలు ఉన్నాయి. సంఘటన స్థలాన్ని కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నిసాలు పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. గొట్టిపాటి ప్రసాద్ నాయుడు హత్య, ప్రసాద్ నాయుడు సొంత కోళ్ల ఫారం లోనే జరిగిందని, కోడి మాంసం కోసం వచ్చిన వాళ్లే చేశారా? లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. కుటుంబ సభ్యులు పలువురిపై అనుమాన వ్యక్తం చేశారని దిశలో కూడా దర్యాప్తు చేస్తామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.